www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023
5
వైఎస్‌ఆర్

కొండలరావును అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రకాశం జిల్లా రాయవరపు అంగన్వాడీ కార్యకర్తను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపిన వైసిపి నాయకుడు కొండలరావును పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, నగర కార్యదర్శి అంజలిదేవి డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అంగన్‌వాడీ మృతురాలి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు విజయ భాస్కర్, గోపి, పవన్, గిరి, ఆనంద్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పాల్గొన్నారు.

'సైక్రియాటిక్' ఖాళీలకు గ్రీన్‌సిగ్నల్

కేబినెట్‌లో 116 పోస్టుల భర్తీకి ఆమోదం
200 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్
రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సైక్రియాటిక్ వైద్య కళాశాలలోని 116 ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం లభించింది. 2019 డిసెంబర్ 23, 24, 25వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రిమ్స్ ఆవరణంలో రూ.272 కోట్లతో కూడిన సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటివ్ విభాగాలకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మరో నెల రోజుల వ్యవధిలో రూ.40.81 కోట్ల వ్యయంతో కూడిన సైక్రియాటిక్ భవన నిర్మాణ పనుల్ని పూర్తి చేసుకోబోతున్న సమయంలో పెద్దఎత్తున పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ముదావహం. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరేజేషన్‌కు ఆమోదం తెలిపిన నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజేషన్ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లాలోని 1100 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో 100 మంది, అన్నమయ్య జిల్లాలో 800 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో సుమారు 100 మంది వెరసి 200 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నట్లు సమాచారం. 2014 సంవత్సరంలో ఆప్కోస్, కార్యాలయ, వ్యక్తిగత ప్రాతిపదికన పెద్ద ఎత్తున కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో నేటికి పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పరిధిలోకి వచ్చే వారి వివరాలను పరిశీలిస్తే 200 మందికి మించి ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. ఇదిలాఉండగా జిల్లాలోని బిసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా అత్యధికంగా లెక్షరర్లు, ఇంజినీరింగ్ విభా గాలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఒపిఎస్ ఇవ్వాల్సిందే : ఫ్యాప్టో

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని కాలరాస్తూ నేటి రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో సిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని కాకుండా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) విధానాన్ని అమలు చేస్తూ తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని 3 లక్షలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి నాలుగు సంవత్సరాల తర్వాత మరొక కొత్త స్కీమ్ ప్రతిపాదించడం ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీసిందన్నారు. ఉద్యోగి రిటైర్మెంట్ నాటికి మూల వేతనంలో 50 శాతం పెన్షన్, దానిపై డియర్నెస్ రిలీఫ్ ఇస్తామని చేసిన ప్రతిపాదన గతంకంటే కొంత మెరుగైనప్పటికీ రిటైరైన ఉద్యోగికి పూర్తిస్థాయి భద్రతను ఇవ్వదని పేర్కొన్నారు. ప్రభుత్వ బడ్జెట్లో 36 శాతం మాత్రమే ఉద్యోగుల జీత భత్యాలకు ఖర్చు చేస్తూండగా మొత్తం ఆదాయాన్నంతటినీ ఉద్యోగుల జీతభత్యాలకే ఖర్చు చేస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇలియాస్ బాషా, రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ విశ్వసనీయతకు మారుపేరుగా ప్రకటించుకునే ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించే విషయంలో మాట తప్పడం తగదన్నారు. పలు రాష్ట్రాలు ఇప్పటికే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ నిర్ణయాలను పునః సమీక్షించాలని. ఉద్యోగుల నుంచి ఏ కాంట్రిబ్యూషన్ లేకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ (1938) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజులరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అబ్దుల్లా, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

విద్యుత్ ఛార్జీల బాదుడు తగదు : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ఛార్జీల పేరుతో పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని, సామాన్య మధ్యతరగతి ప్రజానికం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం నగర కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి విద్యుత్‌ఛార్జీల అదనపు భారం మోపబోమని గత సంవత్సరం ఎపిఇఆర్‌సి ద్వారా ప్రకటన చేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం జూన్‌లో విడుదల చేసిన విద్యుత్ బిల్లుల ద్వారా సామాన్య ప్రజానికం ఉక్కిరిబిక్కిరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత బిల్లులో ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌సిపిసిఎ రకరకాల పేరుతో అదనపు చార్జీల భారం వేశారన్నారు. విద్యుత్ బిల్లులో కనీస వినియోగ ఛార్జీలు రూ.270 అయితే రకరకాల భారాలు కలిపి రూ. 556 వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం సామాన్య ప్రజానికం ఇబ్బందులు అర్థం చేసుకుని తక్షణమే విద్యుత్ బిల్లులో విధించిన అదనపు ఛార్జీల వసూలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని వెనక్కు తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజానికాన్ని కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు చంద్రారెడ్డి, పారుక్ హుస్సేన్, ఓబులేసు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఇడిగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఆర్‌టిసి రీజియన్ ఇడిగా జి. వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.గతంలో ఇక్కడ ఇడిగా పనిచేసిన గోపీనాథ్ రెడ్డి విజయవాడకు బదిలీ అయ్యారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఆర్‌ఎం గోపాల్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులపై జడ్‌పి సిఇఒ ఆరా

ప్రజాశక్తి-చెన్నూరు


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న జడ్‌పి సిఇఒ

స్థానిక పంచాయతీలో జరగు తున్న అభివృద్ధి పనులపై జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి ఆరా తీశారు. గ్రామ పంచాయతీలో ఎక్కడెక్కడ ఏయే పనులు చేపట్టారని, ప్రస్తుతం ఎంతవరకు వచ్చాయని ఎంపీడీవో సురేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. బుధవారం చెన్నూరు ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి ఆయన అధికారులతో సమావేశమై అభివృద్ధి పనుల విషయమై చర్చించారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం (ఎస్ఎడివై) కింద కడప ఎంపీ అవినాశ్ రెడ్డి చెన్నూరు గ్రామ పంచాయతీని దత్తత తీసుకున్నారని చెప్పారు. ఈ పథకం కింద 56 పనులను రూ. 1.78 కోట్లకు ఎంపిక చేయగా వాటికి సంబంధించిన పనులను గత సంవత్సరం 2019-2020లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని తెలిపారు. ఆ పనులు ఎంతవరకు జరిగాయి, పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గంగనపల్లె సురేష్ బాబు, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, కార్యదర్శి శివ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సిడిపిఒను సస్పెండ్ చేయాలి

కడప అర్బన్ : అంగన్‌వాడీ కార్యకర్తలను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న కడప సిడిపిఒను వెంటనే స్పస్పెండ్ చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తల చేత బలవంతగా లెటర్ రాయించుకుంటూ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

11న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్

కడప : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న కడప నగరంలోని మస్తాన్‌వల్లి వీధిలో ఆల్ ఆఫ్ చెస్‌లో 17వ అశ్రఫ్-ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151లో సంప్రదించవచ్చునని తెలిపారు.

బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానం

కడప అర్బన్ : సహిత విద్య రిసోర్స్ పర్సన్ల అభ్యర్థన బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష పతక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఏర్పాటుచేసిన భవిత పాఠశాలలో రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న అభ్యర్థుల బదిలీలకు రాష్ట్ర ఉన్నత అధికారులు అనుమతినిచ్చారని తెలిపారు. అభ్యర్థన బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 8, 9 తేదీలలో ఉమ్మడి కడప జిల్లా నుంచి దరఖాస్తులు స్వీకరించి ఈ నెల 10న నూతన స్థానాలకు ఉత్తర్వులు అందజేస్తారన్నారు. బదిలీలు అవసరమైన వారు తమ అభ్యర్థనలను సమగ్ర శిక్ష పతక అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యాల ప్రకారం బదిలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'సీమ' ప్రజల కష్టాలను తీరుస్తా

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ
'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక'
విడుదలలో నారా లోకేష్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాయలసీమ ప్రజల కష్టాలను చూశానని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వారి కష్టాలను తీరుస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 119 రోజుకు చేరుకుంది. బుధవారం రాత్రి కడప శివారులోని ఓ ప్రయివేట్ కల్యాణ మండపం వద్ద మిషన్ రాయలసీమ పేరుతో అభివృద్ధి ప్రణాళిక విడుదల కార్యక్రమం నిర్వహంచారు. రాయలసీమలోని పార్లమెంటు నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళిక తీరుతెన్నులపై మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాయల సీమ జిల్లాల పరిసరాలకు అనుగుణంగా పెట్టుబడులను పరిశ్రమలను పెద్దఎత్తున తెస్తామని తెలిపారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. రైతులు పంటల సాగుకు పెట్టుబడులు తగ్గించి, గిట్టుబాటు ధరలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్పోర్ట్స్ యూనివర్శిటీ, మైనింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు నుంచి గుంటూరు వరకు వెళ్తున్న వలస కూలీల వెతలను నివారిస్తామని చెప్పారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మూడవ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండవ స్థానంలో నిలవడానికి వైసిపి చేతగాని పాలనే కారణమని విమర్శించారు. రాష్ట్రంలోని భూ ఆక్రమణలపై సిట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైసిపి నాయ కులు టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను తిరగదోడతా మని హెచ్చరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి తరఫ్ 49 అసెంబ్లీ సీట్ల మెజార్టీనిస్తే మిషన్ రాయలసీమ అభివృద్ధి బాద్యత తీసుకుంటానని తెలిపారు.

'మిషన్ రాయలసీమ'లో మాట్లాడుతున్న నారా లోకేష్

టిడిపి హయాంలో రూ.22 వేల కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్‌ను మూలన పడేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందిస్తామని తెలిపారు. బాదుడే బాదుడు తరహాలో పెంచిన పెట్రోల్ డీజిల్, ఇంటి పన్ను, చెత్త పన్ను లను తగ్గిస్తామన్నారు. వైసిపి ఎన్నికల ప్రచారంలో రైతుభరోసా పథ కం కింద రూ. 12,500 ఇస్తామని హామీనిచ్చి రూ.7,500 ఇస్తోం దని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే పగుల గొట్టాలన్నారు. అటువంటి వారి పక్షాన టిడిపి నిలుస్తుందని చెప్పా రు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తా మని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. మైనార్టీలైన అబ్దుల్‌సలాం మొ దలు కుని హాజీరాబేగం, మిస్బా వంటి మహిళలపై దాడులు కొనసాగు తున్నాయని తెలిపారు. రాయలసీమలో పరిశ్రమల ఏర్పాటు, ఉద్యో గాల కల్పనే 'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక' లక్ష్యమని ప్రక టించారు. కార్యక్రమంలో రాయలసీమలోని టిడిపి ఇన్‌ఛార్జిలు పరి టాల శ్రీరామ్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌చౌదరి, గౌరు వెం కటరెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమీర్‌బాబు, కస్తూరి విశ్వ నాథనాయుడు, బిటెక్ రవి, విజయమ్మ, ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయమ్మ

బద్వేల్‌లో ఈ నెల 9న నిర్వహి ంచబోయే నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రను తెలుగుదేశం పార్టీ నాయకులు, యువత, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ పిలుపునిచ్చారు. పోరుమామిళ్లలోని వసుంధర కల్యాణ మండపంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కష్టాలు, బాధలు తెలుసుకోవడం కోసం లోకేష్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్తా ఒక సైనికుడు లాగా పని చేయాలని సూచించారు. సమావేశం అనంతరం పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆమె సమాలోచనలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, కలసపాడు మండల ఇన్‌ఛార్జ్ వెంకట్రామిరెడ్డి, నాగేశ్వరరావు, కాశినాయన మండల ఇన్‌ఛార్జి రాజారెడ్డి, కొండ కృష్ణారెడ్డి, రంతు, పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, బద్వేల్ నియోజకవర్గం యువ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

చింతకొమ్మదిన్నె : పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు కెవికె శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో నెల 9న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు చదువు, వయస్సుతో సంబంధం లేకుండా పాల్గొన్నాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 9848809236లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు వెడల్పు పనులు పరిశీలన

కడప అర్బన్ : దేవుని కడప రోడ్డు వెడల్పు పనులను కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. నగర అభివృద్ధి పనులు భాగంగా అంబేద్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ దేవుని కడప రోడ్డు వైండింగ్ పనులను టౌన్ ప్లానింగ్, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ రోడ్డులో భాగంగా ఆ ప్రాంతంలో ఇచ్చినటువంటి మార్కింగ్ ప్రకారం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

కెఎస్‌ఆర్‌ఎంలో క్రాష్ కోర్స్

కడప అర్బన్ : కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వారు 45 రోజుల క్రాస్ కోర్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నగర విద్యార్థులు ఇంజినీరింగ్ చేర బోయే ఆశావహులు సీ లాంగ్వేజ్, ఎంఎస్ ఆఫీస్, ఐటీ వర్క్‌షాప్ వంటి కోర్సులపై 45 రోజులు పాటు క్రాష్ కోర్స్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కోర్సు జూన్ 12న ప్రారంభమవుతుందని తెలిపారు. కోర్సు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1999 ఉంటుందని, విద్యార్థులకు కడప టౌన్ నుంచి ఉదయం 10 గంటలకు కళాశాల ఉచిత బస్సు బయలు దేరుతుందని, కోర్స్ తరగతులు ఉదయం.11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా సందేహాలు నివృత్తి చేసుకోవడానికి 9849777831, 9398151350లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.2.5 కోట్ల బాదుడు

ప్రజాశక్తి - కడప

విద్యుత్ బిల్లులు చూపుతున్న టిడిపి నాయకులు

పెత్తందారుల ప్రభుత్వం పేద ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ. 2.5 కోట్లు భారం వేసిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ మండిపడ్డారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వ సారి ట్రూఅప్ ఛార్జీల పేరుతో మరో బాదుడుకు శ్రీకారం చుట్టిందని, ఇదేనా సంక్షేమం అని ప్రశ్నించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న పేదలపై పెంచిన కరెంటు ఛార్జీలు మూలిగేనక్కపై తాటి కాయ పడిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. పెంచిన ట్రూ అప్ ఛార్జీల ను రద్దు చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలాని బాష, రాష్ట్ర టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, రాష్ట్ర యాదవ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి శివరాం, 22 డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, అనిల్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం సందర్శన

కడప అర్బన్ : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు మహేష్ బాబు వేసవి శిక్షణా శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మహత్తర కార్యక్రమం పిల్లలకు 'చదవడం మాకిష్టం' పిల్లలు దినచర్యలో చదవడం ఒక భాగం కావాలనే మహత్తర ఆశయమన్నారు. విద్యార్థులకు వేసవి శెలవుల్లో గ్రంధాలయాలలో సమ్మర్ క్యాంపులు నిర్వహించడం వల్ల పిల్లల్లో వున్నా సృజనాత్మక ను వెలికితీయడానికి ఎంతోగానో ఉపయోగపడుతున్నయని తెలిపారు. ప్రతి గ్రామంలో గుడి, బడి, గ్రంథాలయం ఉండాలని సిఎం ఆశయమన్నారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు నేర్చున్న పాటలు, నీతికథలు, బొమ్మలను ఆయనకు చూపించారు. సమ్మర్ క్యాంపు నిర్వహణ పట్ల అయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్.అమీరుద్దిన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, లైబ్రేరియన్స్ సుబ్రమణ్యం, సిబ్బంది శ్రీనివాసులు, సుబ్బమ్మ, హరి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళానికి అపూర్వ స్పందన

కడప అర్బన్ : జిల్లాలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప నియోజకవర్గాలలో యువగళం లోకేష్ పాదయాత్రలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం గాయత్రి టవర్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు, రైతులు, మహిళలు తండోపతండాలుగా పాల్గొన్నారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును మరోసారి చూడాలని సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇది చూసి వైసిపి నాయకులు, ఎమ్మెల్యేలు యువగళం విఫలమైందంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర విఫలమైతే అధికార పక్ష నేతలు మాట్లాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామని భయంతో అసత్య ప్రచారాలు మాట్లాడడం ప్రారంభించారని తెలిపారు. అవినీతి పాలన, భూకబ్జాలు బయటపడ్డాయని చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

2014, జూన్ 2 నాటికి ఐదేళ్లు నిండిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ నిర్ణయం వేలాది మంది ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని, అందరినీ రెగ్యులర్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తేవడాన్ని గతంలోనే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని వారి డిమాండ్ అన్నారు. దానికి బదులుగా ఉద్యోగులపై బలవంతంగా జిపిఎస్ ను రుద్దడం సరికాదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని వైసిపి 2019 ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిందని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని చెప్పారు. సర్వీసును పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న టైం స్కేల్, ఎన్ఎంఆం, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని సకాలంలో రెగ్యులరైజ్ చేయకపోవడం వలన కొంతమంది ఇటీవల కాలంలో రిటైర్ అవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధన వల్ల 7 నుంచి 8 వేల మంది మాత్రమే రెగ్యులర్ అవుతారని తెలిపారు. ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని వైసిపి ప్రభుత్వం హామీకి భిన్నంగా నేటి కేబినెట్ నిర్ణయం ఉందన్నారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు.

వాగ్దానాలు తుంగలో తొక్కిన చంద్రబాబు

ప్రజాశక్తి - కడప

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, 2014 మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చిన తరువాత తుంగలో తొక్కారని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. బుధవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో కరువు, కాటకాలే, ప్రకృతి కూడా సహకరించలేదని చెప్పారు. రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశారని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్నప్పుడు కూడా చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తాను చేసిన మంచిని చెప్పుకునే ధైర్యం లేదు. సొంత నియోజకవర్గం చంద్రగిరిలో పోటీ చేసే దమ్ము లేకనే కుప్పంకు పారిపోయారని ఆరోపించారు. వైఎస్ జగన్ సిఎం అయ్యాక కుప్పాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చారు అన్నారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులే విజయం సాధించారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, ఎపి సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, రఘునాథరెడ్డి, శంకర్ రెడ్డి, వీరా రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర అట్టర్ ప్లాప్

కడప : జిల్లాలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర అట్టర్ ప్లాప్ అయిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కే సురేష్ బాబు, మైదుకూరు శాసనసభ్యులు రఘురామిరెడ్డి అన్నారు. పాదయాత్ర చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేవలం గంటన్నరలో పాదయాత్ర పూర్తి చేసిన ఘనత లోకేష్‌దే అని అన్నారు. బుధవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు, ప్రజలకు పాదయాత్ర గుదిబండగా మారిందన్నారు. ప్రజలు లేక పాదయాత్ర పూర్తి చేసుకుని నిద్ర పోయాడని పేర్కొన్నారు. ప్రతి ప్రాంతంలోకి వెళ్లి అనవసర ఆరోపణలు, అవాస్తవాలను ప్రజలకు కల్లబొల్లిమాటలు చెబుతున్నారు అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ యానదయ్య, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, నాయకులు నారపు రెడ్డి సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున పాల్గొన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

కడప : పిల్లల చదువు, ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు వహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌ఛార్జి డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. కవిత ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని ఆమె పరిశీలించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుకున్న వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివ రించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్త వహించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, పిల్లలు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి కవిత

రాయలసీమ పేరు ఉచ్చరించే అర్హత లేదు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ పేరు ఉచ్చరించే అర్హత టిడిపి, వైసిపి, బిజెపికి లేదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి మిషన్ రాయలసీమ మోసం, హాస్యాస్పదమని విమర్శించారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ (3)ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులను మంజూరు చేయాలన్నారు. టిడిపి అధికారంలో ఉన్న అయిదేళ్లలో ఎందుకు తెప్పించలేదని తులసిరెడ్డి ప్రశ్నించారు. 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని టిడిపి ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. కాంగ్రెసు పాలనలో ప్రారంభమైన మన్నవరం విద్యుత్ పరిశ్రమ కర్మాగారాన్ని కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూసేస్తుంటే టిడిపి ఎందుకు అడ్డుకోలేదన్నారు. కాంగ్రెసు పార్టీని గెలిపిస్తే రాష్ట్రంతోపాటు రాయలసీమ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తులసిరెడ్డి తెలిపారు.

పోస్ట్‌మెన్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కల్లూరుపల్లి పోస్ట్ బ్రాంచ్ ఆఫీస్‌లో జిడిఎస్‌గా పనిచేస్తున్న సిద్ధ వెంకటరమణ సేవలు కొనియాడదగినవని ఐపిఒ రెడ్డి బాషా పేర్కొన్నారు. బిటిపల్లి పోస్ట్ ఆఫీసులో బుధవారం ద్యోగ విరమణ చేసిన సిద్ధ వెంకటరమణకు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. కడప పోస్టల్ జనరల్ సెక్రెటరీ శోభన్‌బాబు ఆధ్వర్యంలో ఆ డివిజన్‌లో పనిచేస్తున్న పోస్టాఫీస్ ఉద్యోగులంతా పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కడప పోస్టల్ జనరల్ సెక్రెటరీ శోభన్‌బాబు, ఎస్‌పిఎంలు జేసుదాస్, లక్కిరెడ్డిపల్లి శ్రీరాముల పోస్ట్ బిపిఎంలు, ఎబిపిఎంలు పాల్గొన్నారు.

లోకేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

గజమాలతో లోకేష్‌ను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

యువగళం పాదయాత్ర పేరుతో కడపకు చేరుకున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబును వేంపల్లె టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం కడపలో లోకేష్‌ను టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, మాజీ వార్డు మెంబరు నల్లగారి కృష్ణారెడ్డి, పివి రమణ, పూల అల్లాబక్ష్, ఇలియాస్ మాబు షరీఫ్, గొటూరు నాగభూషణం, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గౌస్, చంద్రశేఖర్, వెంకటేష్, సుబ్బరాయుడు, రమణ, కాటమయ్య, శేఖర్‌బాబు, కేశవ్, శ్రీనివాసులు, వెంకటయ్య, కొండయ్య, జగన్ పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా : సింగం రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకుడు సింగం రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 2014 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన సమైక్యాంధ్ర పార్టీ తరఫున పులివెందుల అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశానన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో ఏడు మండలాల్లో తనకు బంధువర్గం బలంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

'సమాజ సేవ-సామాజిక బాధ్యత'పై అవగాహన

పులివెందుల టౌన్ : స్థానిక గ్రంధాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సమాజ సేవ-సామాజిక బాధ్యత' అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సేవా సమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం అందరి బాధ్యత అని తెలిపారు. తల్లిదండ్రులను, చుట్టుపక్కల ఉన్న పెద్దలను గౌరవించడం చిన్నతనం నుంచి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణకుమార్, సేవాసమితి సభ్యులు రామచంద్రారెడ్డి, సేవాదళ్ టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

లగేజీ బ్యాగులు వితరణ

పులివెందుల రూరల్ : వైసిపి యూత్ లీడర్ ఆరాం కోటిమల్లు పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ముద్దనూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం 30 మందికి లగేజీ బ్యాగులు పంపిణీ చేశారు. కోటిమల్లు మిత్రబృందానికి విభిన్నప్రతిభావంతుల సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుల ఇకెరెడ్డి రఘునాథ్‌రెడ్డి, సభ్యులు సునీల్, రాజు, ప్రసాద్, మహమ్మద్, కోటిమల్లు మిత్రులు ప్రకాష్, బాబా, హితేంద్ర, సుధీర్, సద్దాం, చిన్న, కార్తిక్, షాకీర్, సత్తి పాల్గొన్నారు.

బిందు సేద్యం పరికరాలకు దరఖాస్తులు

పులివెందుల రూరల్ : అరటి ఉప ఉత్పత్తుల కేంద్ర నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్, డిప్యూటీ సిఇఒ రమేష్ సూచించారు. స్థానిక బ్రాహ్మణపల్లె రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న అరటి ఉప ఉత్పత్తుల కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నల్లపురెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రం సంబంధించి ఎపిఎంఐపి ఎండి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎపిడి డ్రిప్ పరికరాల మీద ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు 10,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల ఏర్పాటుకు ఈ ఏడాది అనుమతులిచ్చామని, ఆసక్తిగల రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మైకెల్ రాజీవ్, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, అగ్రికల్చర్ అధికారి చంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ బకాయి వసూళ్లకు చర్యలు : సిఎండి

ప్రొద్దుటూరు : విద్యుత్ రెవెన్యూ బకాయి వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్‌రావు ఆదేశించారు. స్థానిక కళ్యాణమండపంలో బుధవారం విద్యుత్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు రైతులు డిపాజిట్ చేసిన వెంటనే నెలలోగా సర్వీస్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ సర్వీసుల డిపిటి ఖాతా నిర్వహణ పూర్తి చేయాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని తగ్గించాలని ఆయన ఆదేశించారు. సిబ్బంది వారికి కేటాయించిన చోట నివాసముండాలన్నారు. కార్యక్రమంలో సిజియం (ఆపరేషన్) గురవయ్య, సిజిఎం (రెవెన్యూ) ధర్మజ్ఞాని, ఎస్‌సి రమణ, ఒఎస్‌డి శ్రీనివాసులు, ప్రొద్దుటూరు ఇఇ శ్రీనివాసులరెడ్డి, డిఇఇలు, ఎఇలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన జెసి

బ్రహ్మంగారిమఠం : మండల రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. కార్యాలయంలో జరుగుతున్న రీ సర్వే పనులను తనిఖీ చేశారు. భూ రీసర్వే గురించి సర్వేయర్ వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ ఉత్తర్యులతో మాట్లాడుతూ బెంగళూరు-విజయవాడ హైవే పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటరమణ, విఆర్‌ఒ కౌశిరెడ్డి, సర్వేయర్ పాల్గొన్నారు.

12న జగనన్న విద్యా కిట్లు అందజేత

బ్రహ్మంగారిమఠం : ఈనెల 12న జగనన్న విద్యా కిట్లను ఎస్-ఎస్ఎ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు ఆ పథక అసిస్టెంట్ సిఎంఒ కొండా దశరథరామిరెడ్డి తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ పుల్లయ్య పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కట్టుబడతాం

నగదు రద్దును వ్యతిరేకించిన కౌన్సిలర్లు - ఆరు నెలల నగదు మినహాయింపు కోరిన కాంట్రాక్టర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీకి సంబంధించి 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను దినసరి మార్కెట్ గేటు నగదు రద్దును కౌన్సిలర్లు పూర్తిగా వ్యతిరేకించారు. వివరాల్లోకి వెళితే.. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను బాలాంజనేయరెడ్డి అనే కాంట్రాక్టర్ రూ.15,50,100 బహిరంగ వేలం పాటలో దినసరి మార్కెట్ గేటు వసూళ్లను దక్కించుకున్నారు. వేలంపాట మొత్తానికి జిఎస్‌టి 18 శాతం కలుపుకొని రూ.18,29,118 నగర పంచాయతీకి చెల్లించాల్సి ఉంది. డిపాజిట్ రూపంలో రూ.5లక్షలు, మొదటి కంతుగా రూ.1,32,912, రెండవ కంతుగా రూ.1,32,912 మాత్రమే నగర పంచాయతీకి చెల్లించారు. అనంతరం 9 మాసాలపాటు ఎలాంటి నగదు నగర పంచాయతీకి జమ చేయలేదు. నగర పంచాయతీ వసూళ్లకు సంబంధించి భారీ వాహనాలకు రూ.80గాను, ట్రక్కు, ఇతర వాహనాలకు రూ.50 రేట్లు ప్రతిపాదించినా, వాటిని కాంట్రాక్టర్ బేఖాతరు చేస్తూ.. భారీ వాహనాలకు రూ.200 నుండి రూ.300 రాబడుతున్నట్లు, దానికి సంబంధించిన టోకెన్లు ఇవ్వడంతో అప్పట్లో పట్టణంలో చర్చనీయాంశమైంది. దీనిపై పలు దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. నగర పంచాయతీ అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారే తప్ప, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫిబ్రవరిలో 'ప్రజాశక్తి' దినపత్రికలో 'నగర పంచాయతీ ఆదాయానికి గండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. మార్చి 3న రూ.2 లక్షలు, 29న రూ.1.50 లక్షలు నగర పంచాయతీ అధికారులు సదరు కాంట్రాక్టర్ నుండి వసూలు చేశారు. కానీ మిగిలిన రూ.7,13,294 ఇప్పటికీ వసూలు చేయకపోగా, ఇటీవల జరిగిన కౌన్సిల్ ఎజెండాలో ఈ నగదును రద్దు చేసేలా కౌన్సిల్ ఆమోదం పొందుపరచడం అటు కౌన్సిలర్లలోను, ఇటు ప్రజల్లోనూ ఆశ్చర్యానికి గురిచేసింది. సదరు కాంట్రాక్టర్ స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు కావడంతో ఆయన సలహా మేరకే ఈ రద్దు అంశాన్ని కౌన్సిల్ ఎజెండాలో పొందుపరచి ఉంటారని స్థానికులు గుసగుసలాడుతున్నారు. అయితే దీన్ని కౌన్సిలర్లు పూర్తిగా వ్యతిరేకించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రద్దు అంశాన్ని కౌన్సిల్ ఎజెండాలో ఎందుకు పెట్టవలసి వచ్చిందో తెలపాలంటూ కౌన్సిలర్లు నిలదీశారు. కడప-ముద్దనూరు రోడ్డు విస్తరణ పనులు జరిగే సమయంలో వ్యాపారాలు లేవని సదరు కాంట్రాక్టర్ వసూలు చేయలేదని, అందుకుగానూ ఆరు నెలలకు సంబంధించి నగదును మినహాయించాలని కోరినట్లు కమిషనర్ జగన్నాథ్ పేర్కొన్నారు. కొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ వ్యాపారం అన్నాక నష్టాలు, లాభాలు ఉంటాయని, ఇందుకు పురపాలక బాధ్యత వహించి రద్దు చేయలేమన్నారు. అసలు ఈ అంశాన్ని ఎజెండా నుండి తొలగించాలని తేల్చి చెప్పారు. నగర పంచాయతీ అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఆదాయాన్ని ఒకరి స్వార్థం కోసం రద్దు చేయడం తగదన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని నాయకులను, అధికారులను ప్రజలు కోరుతున్నారు.

కౌన్సిల్ మాటే తీర్మానం..

నగర పంచాయతీలో ఏదేని అంశంపై రద్దు విషయంలో కౌన్సిల్ మాటే తీర్మానం. అదేవిధంగా దినసరి మార్కెట్ గేటు వసూళ్ల విషయంలో కూడా నిబంధనల ప్రకారం మూడుసార్లు కౌన్సిల్ సమావేశం ఎజెండాలో చేర్చాలని, కౌన్సిల్ ఆ అంశం తిరస్కరించినచో వారి మాటే తీర్మానం చేసి తదుపరి ఆలోచన చేస్తాం. ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా జారీ చేశాం.

- పగడాల జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ వెంకటేశులు సూచించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని స్పందన, ఎపి సేవ సర్వీసులు చూస్తున్న అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం', 'స్పందన'కు సంబంధించి వస్తున్న అర్జీలను వెంటనే పరిశీలించి, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అర్జీలో సమస్యలున్న వారితో మాట్లాడి ఈ సమస్యని మీరు ఎందుకు పరిష్కరించలేకపోతున్నారు అనే విషయాన్ని కూలంకుశంగా వివరించాలని తెలిపారు. అర్జీ వచ్చిన వెంటనే దాన్ని మనం యాక్సెప్ట్ చేసి వాటిని పరిష్కరించే సమయం కన్నా ముందే మనం పరిష్కరించాలన్నారు. అలాకాకుండా సమయం ఉందిలే అని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సచివాలయంలో అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్జీని బఫ్లింగ్ లేకుండా నీట్‌గా స్కాన్ చేసి పంపించాలని సూచించారు. మీకేమైనా సమస్యలుంటే మా దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

హాజరైన అన్ని శాఖల అధికారులు

మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశులు

వైసిపిలో పలు కుటుంబాలు చేరిక

వైసిపిలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి సమక్షంలో గ్రామ నాయకులు మునిరెడ్డి, భద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నాయకులు మునిరెడ్డి, భద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చి పార్టీలో చేరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహాయ సహకారాలతో పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ సుమంత్ యాదవ్, సర్పంచ్ రాజ్యలక్ష్మి, ముద్దనూరు ఉప సర్పంచు వీరాంజనేయరెడ్డి, నాయకులు శంకరరెడ్డి, లక్ష్మిరెడ్డి, భాస్కర్ రెడ్డి, పుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

సుందరయ్య నగర్ వంతెనకు భూమిపూజ

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని 3వ కౌన్సిల్ వార్డులో ఉన్న సుందరయ్య నగర్‌కు ఎట్టకేలకు వంతెన మంజూరైంది. దీనికి సంబంధించి బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భూమిపూజ చేశారు. వంతెన నిర్మాణానికి సంబంధించి రూ.33,21,180తో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చిస్తున్నట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. వంతెనను 11.5 మీటర్ల పొడవుతో, 4.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తామన్నారు. అనంతరం సుందరయ్య నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చుక్కల భూమి రైతులకు పట్టాలు పంపిణీ

జమ్మలమడుగు : నియోజకవర్గంలో చుక్కల భూమి రైతులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సాయిశివాని కళ్యాణమండపంలో బుధవారం పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో 2,206 ఎకరాల చుక్కల భూములపై 1,119మంది రైతులకు పత్రాలు పంపిణీ చేశారు. రైతులపట్ల చిత్తశుద్ధితో సీఎం జగన్ చుక్కల భూమి సమస్యను పరిష్కరించారన్నారు. గడిచిన ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించలేదని ఆయన విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఆరు మండలాల తహశీల్దార్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు రైతులకు అందాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అధికారులు సకాలంలో ప్రతి రైతుకు అందజేయాలని జడ్పీటీసీ రవి కుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులకు మంజూరు చేయాలని రవికుమార్‌రెడ్డి కోరారు. వేరుశనగ విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు ఎఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పాపాఘ్ని నది నుండి నీటిని సరఫరా చేయాలని ఎంపిటిసిలు కోరారు. ప్రతి ప్రాంతానికి పాపాఘ్ని నది నుండి నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు సభ దృష్టికి తెచ్చారు. డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేకదృష్టి పెట్టాలని పలువురు ఎంపిటిసిలు కోరారు. రోడ్డు వెడల్పు పనులు పూర్తయితే ఆ సమస్య తీరుతుందని జడ్పీటీసీ తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, మండల ప్రత్యేకాధికారి రవీంద్రరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో విద్యార్థులను చేర్పించండి

ఇంటర్ విద్య కోసం వేంపల్లెలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బుధవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇంటింటికి అధ్యాపకులు వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంచి విద్యా బోధన చేయడంతోపాటు అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. జూనియర్ కళాశాలలో 9 మంది అధ్యాపకులను కూడా నియమించారని తెలుగు అధ్యాపకులు చెరుకూరి శ్రీనువాసులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రచార కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డయేరియాపై జాగ్రత్తలు వహించాలి

డయోరియా పట్ల అవగాహన కలిగి ఉండడంతోపాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నిషా సూచించారు. తాళ్ళపల్లె సచివాలయంలో బుధవారం నీళ్ల విరేచనాల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత అనేది ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ వెంకటరత్నం, రాణి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్‌ఎం, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

మండల పరిధిలోని చిన్నగురు వలూరు గ్రామంలో బుధవారం శ్రీరామ చంద్రస్వామి శిఖరం ధ్వజ, పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు హాజరయ్యారు. గజ స్థంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కోలాటం, బండలాగుడు పోటీలను, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిఆర్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, మఠం అచలానంద స్వామి, సొసైటీ చైర్మన్ వేమారెడ్డి, పెద్దగురువలూరు సర్పంచు రాజేష్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, సూర్య నారాయణరెడ్డి, శివారెడ్డి, గోవర్ధన్, జయ సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పసుపు కొనుగోలుపై నిబంధనలు సరికాదు

ప్రజాశక్తి - చాపాడు

పసుపు కొనుగోలుపై నిబంధనలు పెట్టడం సరికాదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించామని ఎంతో ఆర్భాటంగా చెప్పి, సేకరణలో పలు నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. మైదుకూరు, పోరుమామిళ్ల, సిద్దవటం, ఖాజీపేట, పులివెందుల, జమ్మలమడుగులలో పసుపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నాలుగురోజులైనా ఒక క్వింటా కూడా కొనుగోలు చేయలేదన్నారు. పసుపు పంటను మద్దతు ధరతో మొత్తం కొనుగోలు చేయకపోతే టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అధికారులు స్పందించి రైతులు పండించిన పసుపు పంటను కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

పశువులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - దువ్వూరు

గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్యం అందించాలని కానగూడూరు పశువైద్యాధికారి శ్రీహరి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్న సింగనపల్లె రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి ఆర్‌బికెలోని రికార్డులను పరిశీలించారు. పశువులకు జబ్బులు వచ్చిన వెంటనే వాటికి సంబంధించిన మందులను ఇవ్వాలన్నారు. మందుల కొరత ఉంటే దువ్వూరులో అందజేస్తారని డాక్టర్ శ్రీహరి తెలిపారు.

గెజిట్‌లో పేరున్న ప్రతి ఒక్కరూ అర్హులే

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టులో మొదటి విడతగా ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలకు ఇప్పటివరకు పరిహారం పొందలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని తహశీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. గతంలో ఆయా గ్రామాల్లో నిర్వహించిన సోషల్ ఎకనామిక్స్ సర్వేలో పేరు నమోదు కాబడి అర్హత పొంది ఉంటే అలాంటి వారు ఎవరూ పరిహారం కోసం ఆందోళన చెందవద్దన్నారు. గతంలో రూ.6 లక్షల 75 వేల రూపాయలు తీసుకున్న వారు మిగిలిన మూడు లక్షల 25 వేల రూపాయలకు సంబంధించి అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. అలాగే రూ.10 లక్షల పరిహారం రావలసిన వారు కూడా అర్జీలు ఇవ్వాలని ఆయన సూచించారు. గెజిట్‌లో పేరు ఉన్న ముంపు బాధితులు అందరికీ తప్పనిసరిగా పరిహారం అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందని మండల గ్రంథాలయ శాఖ ఇన్‌చార్జి అధికారి రాజ్ కుమార్ అన్నారు. బి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మర కొట్టాలు గ్రామ 'పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని' (బుక్ డిపాజిట్ సెంటర్) ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తక నిక్షిప్త కేంద్రంలో పఠనం చేస్తున్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దోహదపడుతుందన్నారు. డం .పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు వాగ్దాడం శివశంకర్, అప్పనపల్లె గ్రామ పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న స్థానికులు

మినీ బస్సు బోల్తా : పలువురికి గాయాలు

ప్రజాశక్తి - దువ్వూరు

కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం క్రిస్తు రాజపురం వద్ద విజయలక్ష్మి గోడౌన్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి కాణిపాకం వెళుతున్న మినీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వంకలోకి దూసుకెళ్లింది. అయితే ఆ వంకలో కొద్దిపాటి ఎత్తు ప్రదేశం ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. వెంటనే గోడౌన్ సమీపంలో ఉన్న కూలీలు సంఘటనాస్థలానికి చేరుకుని బస్సు వెనుకవైపు అద్దం పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: PRODDATUR.
I.A.No. 47/2021
O.S.No. 75/2021

K.Venugopal Reddy, S/o Mukkal Reddy, R/o D/No.3/995, Y.M.R.Colony, Proddatur Town, Kadapa District. **...Petitioner/Plaintiff**

Vs

D.Surendra Kumar, S/o Pedda Subba Rao, R/o.D/No.3/0300, T.B.Road, Proddatur Town, Kadapa District. **...Respondents/Defendant**

SUMMON & NOTICE

Please take Summon & Notice that the above suit filed by the petitioner/Plaintiff for attachment and recovery of suit amount against you. and the said matter is posted on 22/06/2023 for your appearance of 10.30 A.M. Please make it Convienent to attend the above said Hon'ble Court on the above said date and time either in person or through an advocate, failing wchich matter will be decided in your obsence as per law. please take summon & notice accordingly.

For Hg: 22/06/2023.

G.V.BHASKAR REDDY
Advocate, Proddatur.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR.
O.S.No. 528/2021

K.Prameela Devi, W/o Venu Gopal Reddy, R/o D/No.3/995-B, Y.M.R.Colony, Proddatur Town, Kadapa District. **...Plaintiff**

Vs

Settypalle Nagi Reddy, S/o S.Raghurami Reddy, Contractor, R/o Nehru Road, Proddatur Town, Kadapa District. **...Defendant**

SUMMON

Please take Summon that the above suit filed by the Plaintiff for recovery of suit amount against you. and the said matter is posted on 04/07/2023 for your appearance of 10.30 A.M. Please make it Convienent to attend the above said Hon'ble Court on the above said date and time either in person or through an advocate, failing wchich matter will be decided in your obsence as per law. please take summon accordingly.

For Hg: 04/07/2023.

G.V.BHASKAR REDDY
Advocate, Proddatur.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 57/2023
I.A.No. 849/2022
O.S.No. 109/2022

Gotham Narasimhaiah, Hindu, Aged about 69 years, Resident of Badvel Town and Mandal, Kadapa District. **...Petitioner/3rd Pardy**

And

Shaik Akbar, S/o Pakkir Sab, Muslim, Aged about 72 years Resident of Lakkireddipalli Village of CK Dinne Mandal, Kadapa District. **...1st Respondent**

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా, పై తెలిపిన పిటిషనర్ అయిన గోతం నర్సింమయ్య పై పిటిషన్ లో అటాచ్‌మెంట్ రైసింగ్ కొరకు పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల 19.06.2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై సదరు పిటిషన్‌లో అభ్యంతరాలు తెలుపు కొనవలెను లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వి.రామమోహన్, బి.యన్.అర్బర్ అలీఖాన్
అడ్వకేట్స్, కడప.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA.
E.P.NO. 567/2021 In
O.S.No. 101/2013.

Union of India Represented by Additional Superintendent of Post Offices department of posts Proddatur Division, Proddatur Town, YSR Kadapa District. **...Petitioner(D.H.R)**

Vs

1. K.Kullayappa, S/o Sanjeevaiah, Postal Assistance presently under suspention.
2. K.Radha, W/o K.Kullayappa Both are residing at D.No.36/208/35/6, Sree Nagar Colony, Kadapa City. **...Respondents(J.D.R. 1&2)**

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పై నెంబరులో పిటిషనరు (డి.హెచ్.ఆర్) రెస్పాండెంటు పైన ఇ.పి. దాఖలు చేసివున్నారు. రెస్పాండెంట్సు నోటీసుకు గాను 04.07.2023వ తేదీన వాయిదా వున్నది. రెస్పాండెంట్‌కు ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు వాయిదాకు హాజరయ్యి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షముగా ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

జి.శ్రీనివాసులరెడ్డి, M.Sc.,B.L.,
కె.శ్రీనివాసులు, M.A.,B.L.,
వై.శ్రీనివాసులు, L.L.B.,
పిటిషనరు అడ్వకేట్స్, కడప. సెల్: 9441501790.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 57/2023
I.A.No. 688/2021
O.S.No. 167/2017

Pagadala Subbarayudu, S/o Nagaiah, Hindu, aged about 51 years, Resident of Nagireddypalli Village, Kadapa District. **...Petitioner/Plaintiff**

Vs

1. Dandu Pedda Subbarayudu, S/o Subbaiah, Hindu, aged about 72 years.
2. Dandu Pedda Venkata Subbaiah, S/o Subbaiah, Hindu, Aged about 49 Years.
3. Dandu Sreenivasulu, S/o Subbaiah, Hindu aged about 49 years
4. Dandu Venkata Subbamma @ Mada Venkatasubbamma, W/o Mada Venkateswarlu, Hindu aged about 56 years.

1to4 are residing at Palugurallapalli Village, B-Matam Mandal, Kadapa District.

11. Dr.Yenamala Chenna Reddy, S/o Sanjeeva Reddy, Hindu, aged about 47 years, Residing at D.No.1/441(11) Aravinda Nagar, Kadapa City, Kadapa District.
12. Yenamala Lakshmi Devi, W/o Sanjeeva Reddy, Hindu, aged about 70 years, Residing at D.No.1/441(11) Aravinda Nagar, Kadapa City, Kadapa District.

...Respondents 1to 4 and 11&12/Defendants

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా, పై తెలిపిన పిటిషనర్ అయిన పగడాల సుబ్బరాయుడు డాక్యుమెంట్స్ వేయడంలో జరిగిన ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నయెడల 14.06.2023వ తేదీన ఉదయం 10.30గంటలకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై సదరు పిటిషన్‌లో అభ్యంతరాలు తెలుపుకొనవలెను లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వి.రామమోహన్, బి.యన్.అర్బర్ అలీఖాన్
అడ్వకేట్స్, కడప.